క్లుప్తంగా

నేడు కామ్రేడ్ లింగమూర్తి సంస్మరణ సభ

కడప సెవెన్‌రోడ్స్ : కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు లింగమూర్తి సంస్కరణ సభ ఆదివారం ఉదయం 10 గంటలకు కడప నగరంలోని నూర్జహాన్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. 60 ఏళ్లపాటు పేద ప్రజలకు సేవలు అందించిన లింగమూర్తిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలు, కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సీపీఐ ఆధ్వర్యంలో ప్రేమ వివాహం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ప్రేమ వివాహాన్ని జరిపించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర మాట్లాడుతూ అనంతపురం పట్టణం కాటిగాని కాలువ గ్రామానికి చెందిన పుల్లలరేవు ఎర్రిస్వామి రామస్వామి, రామసుబ్బమ్మల కుమార్తె పి.మహేశ్వరి, వైఎస్‌ఆర్ జిల్లా మైదుకూరు పట్టణం శాంతినగర్‌కు చెందిన మెటపోతుల ఆనందరావు, సునీత కుమారుడు ప్రసన్న కుమార్‌కు కులాంతర ప్రేమ వివాహాన్ని జరిపించామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంపీ సుబ్బారెడ్డి, పి.శ్రీరాములు, ప్రభాకర్, సుబ్బరాయుడు, పి.భాస్కర్, భాగ్యలక్ష్మి, షావలి, నాగేశ్వరరావు, తేజ, అరుణ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నియామకం


రామశేఖర్

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సారెడ్డి రామశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్ కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నారుపల్లి జగన్‌మోహన్‌రెడ్డి ఈ మేరకు నియామక పత్రాన్ని రామశేఖర్‌కు అందజేశారు. జిల్లాలో రెడ్ల ఐక్యత, రెడ్డి సంఘం పటిష్టతకు కృషి చేస్తామని ఈ సందర్భంగా రామశేఖర్ తెలియజేశారు. తన నియామకానికి దోహదపడిన జిల్లా అధ్యక్షులు ఎల్వీ భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

స్పోర్ట్స్ డ్రెస్ వితరణ


విద్యార్థులకు అందించిన స్పోర్ట్స్ డ్రస్‌తో స్టెప్ సిబ్బంది, హెచ్‌ఎం, ట్రస్ట్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ గాంధీనగర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు సమారిటన్ చారిటబుల్ ట్రస్ట్, వసుధ ప్రభా ట్రస్ట్ వారు స్పోర్ట్స్ డ్రెస్‌ను వితరణగా అందజేశారు. వీటిని స్టెప్ సీఈఓ సాయి గ్రేస్ చేతుల మీదుగా శనివారం అందించారు. కార్యక్రమంలో సమారిటన్ చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ భారత్ చటకొండు, వైస్ ప్రెసిడెంట్ పవన్ కళ్యాణ్, వసుధ ప్రభా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ కన్న, నీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్ధన్, స్టెప్ జూనియర్ అసిస్టెంట్ నాగయ్య, గాంధీనగర్ హైస్కూల్ హెచ్‌ఎం షేక్ ఆశ్రీఫున్, పీఈటీ రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం


యోగాసనాలు అభ్యసిస్తున్న ఇంటాక్ సభ్యులు

కడప కల్చరల్ : యోగాతో బరువు నియంత్రణతోపాటు ఆరోగ్యం లభిస్తుందని ప్రముఖ యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి అన్నారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా ఐదవరోజు శనివారం కడప నగరం పటేల్ రోడ్డులోని మిత్ర యోగా కేంద్రంలో ఇంటాక్ సభ్యులచే యోగా ప్రదర్శన నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక్కొక్క యోగాసనాన్ని వేయించి దాని ఫలితం శరీరం, మనసులపై ఎలా ఉంటుందో వివరించారు. ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఈనెల 19 నుంచి ప్రపంచమంతటా వారసత్వ వారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా చాప్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించడం, చిత్రకళ, వాస్తు నిర్మాణ కళల ఔన్నత్యం, నృత్యంపై విద్యార్థులు, ప్రజలకు వివరించామన్నారు. నృత్యం, చేనేతలపై కూడా అవగాహన కల్పించి సోమవారం ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు గంగాధర్ బృందం పాల్గొన్నారు.

హమాలీ కూలి పెంపుపై హర్షం

కడప సెవెన్‌రోడ్స్ : పౌర సరఫరా సంస్థలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.25 నుంచి రూ.28కు కూలి పెంచడం హర్షణీయమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లాలు తెలిపారు.

గౌస్‌నగర్‌లో తాగునీటి కష్టాలు

- పగిలిన పైపులైన్
- పది రోజులుగా ఆగిన నీటి సరఫరా
- చందాలు వేసుకుని ట్యాంకర్ల ద్వారా కొనుగోలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


పగిలిన పైపులైన్



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం 27వ డివిజన్ పరిధిలోని గౌస్‌నగర్ వాసులు పది రోజుల నుంచి తాగునీటికి తీవ్ర కష్టాలు పడుతున్నారు. ఆ కాలనీ పైపులైన్.. రోడ్డు మరమ్మతు పనుల్లో పగిలి నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో పది రోజులుగా మంచినీటి సరఫరా కావడం లేదని కాలనీ వాసులు తెలిపారు. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. అప్పుడప్పుడు ఒక ట్యాంకర్ పంపుతున్నారని, ఆ నీరు అందరికీ సరిపడక చాలా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మందికి ఆ నీరు కూడా దొరకడం లేదని తెలిపారు. ఈ గౌస్‌నగర్‌లో దాదాపు 8 వేల మంది జనాభా ఉన్నారు. ఇందులో ఎక్కువ మంది కూలి పనులు చేసుకునే కార్మికులు. వారంతా ఉదయం లేచింది మొదలు కూలి పనులకు వెళ్లాలంటే మంచి నీటికి ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. పనికి వెళ్లితే ట్యాంకర్ వచ్చినప్పుడు నీరు పట్టుకునేందుకు వీలు కావడం లేదని, కొంత మంది కూలి పనులు మానుకుని మంచినీటి కోసం ఇళ్ల వద్దే వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. కార్పొరేషన్ అధికారులు పంపే ట్యాంకర్లు సరిపోగా.. స్థానికంగా కొంతమంది చందాలు వేసుకుని ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని కొనుగోలు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమతులు చేసి మంచినీటి సమస్యను పరిష్కరించాలని గౌస్‌నగర్ వాసులు కోరుకుంటున్నారు.

ట్యాంకర్లను కూడా...



గౌస్‌నగర్ కాలనీకి మంచినీటిని సరఫరా చేసే పైపులైన్ పగిలి పది రోజులైంది. ఇంత వరకు కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మంచినీటికి చాలా ఇబ్బందులు పడుతున్నాము. మంచినీటి ట్యాంకర్లను కూడా సక్రమంగా పంపడం లేదు. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమత్మలు చేయాలి.

\- ఖదీర్, గౌస్‌నగర్, కడప

చందాలు వేసుకుని...



కార్పొరేషన్ అధికారులు సరఫరా చేసే మంచినీరు సరిపోక కాలనీవాసులు చందాలు వేసుకుని మంచి నీటి ట్యాంకర్లను తెప్పించుకుంటున్నాం. అవి కూడా సరిపోక ఇబ్బందులు పడుతున్నాం. మంచినీటి సమస్యతో సక్రమంగా కాలనీలో కొంత మంది కూలి పనులకు కూడా వెళ్లలేక పోతున్నారు. అధికారులు స్పందించి ఎక్కువ ట్యాంకర్లను పంపి దాహార్తి తీర్చాలి.

\- అల్లాబకాష్, గౌస్‌నగర్, కడప

ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా..



గౌస్‌నగర్ మంచినీటి సమస్య గురించి కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీంతో గౌస్‌నగర్‌వాసులు మంచినీటికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమత్మలు చేయాలి.

\- ఖాదర్‌బాషా, గౌస్‌నగర్, కడప

సైనికుల సంక్షేమానికి కృషి


రఘురామయ్యను సన్మానిస్తున్న మాజీ సైనికులు

వైవీయూ : జిల్లా సైనిక సంక్షేమాధికారిగా ఐ.రఘురామయ్య సైనికుల సంక్షేమానికి కృషి చేశారని జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా సైనిక సంక్షేమాధికారిగా పని చేస్తున్న ఐ. రఘురామయ్య డిప్యుటేషన్ ముగిసి తిరిగి మాతృశాఖకు వెళ్తున్న నేపథ్యంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం కడప నగరంలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా సైనిక సంక్షేమాధికారిగా ఐదేళ్లపాటు సైనికులు, మాజీ సైనికులు, వితంతువులు, వారి కుటుంబ సభ్యులకు ఉత్తమ సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జిగా ఎండీ రజాక్‌ఖాన్

చిత్తూరు సైనిక సంక్షేమ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఎండీ రజాక్‌ఖాన్‌ను వైఎస్‌ఆర్ కడప జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారిగా నియమిస్తూ సంబంధిత శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి స్థాయి అదనపు బాధ్యతలతో ఈయన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సలీంబాషా

వైవీయూ: సోషల్ మీడియా వినియోగం, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేమల సలీంబాషా సూచించారు. శనివారం కళాశాలలో సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.శాంతమ్మ మాట్లాడుతూ సోషల్ మీడియాను వినియోగించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ పి.వి. సునీత, అడ్వకేట్ ఉమాదేవి, అధ్యాపకులు జి.విజయలక్ష్మీదేవి, ఎం.గురుమోహన్‌రెడ్డి, ప్రకాష్ నారాయణరెడ్డి, భూషణ్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి, కృష్ణవేణి, రవిశేఖర్‌రెడ్డి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

పోడర్ ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ డే



విజేతలతో పోడార్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్ జీఎం, హెచ్‌ఎం

కడప ఎడ్యుకేషన్ : కడపలోని పోడర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం వార్షిక గేమ్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం విజయ మాధవిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని ఏపీ, తెలంగాణ పోడార్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్ జీఎం డాక్టర్ రామ్‌గోపాల్‌కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆధ్వర్యంలో భారీ పరేడ్‌ను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కృషి, పట్టుదల ఉంటే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. తరువాత విద్యార్థులకు ట్రాక్, ఫీల్డ్ రేసులు, రిలే రేసులు, లాంగ్‌జంప్, హైజంప్, ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారిని చాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేసి అభినందించారు.

నేడు గ్రామోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం సీపీ బ్రౌన్ గ్రంథాలయం సమీపంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు సూర్య చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ ప్రభాకర్, ఆలయ ధర్మకర్త నాగిరెడ్డి, రమాదేవి, అర్చకులు రవికుమార్‌లు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు గణపతి హోమం, అనంతరం తీర్థ ప్రసాద వినియోగం, మధ్యాహ్నం 12.30కు బిక్ష కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 3.30కు స్వామి కలశ పూజ, 4 నుంచి గ్రామోత్సవం ఉంటుందన్నారు. గ్రామోత్సవంలో పాల్గొనే కన్నెస్వాములకు పూజాద్రవ్యాలైన బియ్యం, కొబ్బరికాయ, కలశం చెంబు సూర్యచారిటబుల్ ట్రస్టు అందిస్తుందని తెలిపారు. పాల్గొన దలిచిన వారు 83414 45200 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

25 నుంచి వర్క్‌షాప్

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో కంప్యూటర్ సైన్స్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వర్క్‌షాప్‌నకు సంబంధించిన కరపత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ ఆవిష్కరించారు. భారత ప్రభుత్వం, విజ్ఞాన, సాంకేతిక విద్యామంత్రిత్వశాఖ, స్టార్ డీబీటీ సహకారంతో 'బ్లాక్ చైన్ టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్' అనే అంశంపై విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు వై.సావిత్రి, వై.అనిత, టి. మనోహర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంక గాంధీ గెలుపు హర్షణీయం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ కేరళ రాష్ట్రం వాయనాడ్‌లో ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలుపొందడం హర్షణీయమని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, జేఎంఎం కూటమి ఘన విజయం సాధించడంపై కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ హర్షం వ్యక్తం చేశారు.

ఆఖరి వారం.. వనభోజనాల జోరు

- నేడు కడపలోనే పలు కుల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు
- ఈ ఏడాది అరుదుగా నిర్వహణ
- కార్తిక మాసంలో వర్షాల రాకతో ఆలస్యం

కడప కల్చరల్ : కార్తిక మాసంలో ఒకే రోజున ఐదు కుల సంఘాలు వన భోజనం నిర్వహించడం జిల్లాకు అరుదైన విషయమే. కార్తిక మాసంలో వచ్చే నాలుగు ఆదివారాల్లో తొలి వారం విడిచి మిగతా వారాల్లో వన భోజనాలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఎక్కువగా రెండు, మూడు ఆదివారాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈసారి చివరి ఆదివారం ఒకరిద్దరు మినహా మిగతా కులాల వారు వన భోజనాలకు తరలివెళ్లడం అరుదైన అంశంగా చెప్పుకుంటున్నారు. దీంతో ఒక దశలో వనభోజనానికి అనువైన ప్రదేశాల ఎంపిక సమస్యగా మారింది. ఈ దశలో కొందరిని కల్యాణ మండపాలు ఆదుకుంటున్నాయి. మిగతా కుల సంఘాలు దేవాలయాలు, మామిడి వనాలు, ముఖ్యంగా శివాలయాల్లో వనభోజనాలను ఏర్పాటు చేసుకున్నారు. దాదాపు అందరూ ఇప్పటికే కుల సంఘాల నాయకుల ద్వారా తమ సభ్యులకు విస్తృత ప్రచారం చేసి ఎక్కువ మంది కులస్తులు హాజరయ్యేలా కృషి చేస్తున్నారు. మరికొందరు ఇతర ప్రాంతాల నుంచి తమ కులాలకు చెందిన ప్రముఖులను అతిథులుగా ఆహ్వానించారు. నగరం నుంచి వనాలకు తరలి వెళ్లేందుకు కొందరు ప్రత్యేక వాహనాలను కూడా ఏర్పాటు చేసుకున్నారు.

ఎందుకిలా?

ఎప్పటిలా ఈ సంవత్సరం రెండు, మూడు కార్తిక ఆదివారాల్లో వన భోజనాలు నిర్వహించలేకపోయారు. ఈ వారాలలో వెళ్లేందుకు సంఘాలు సిద్ధమైనా.. రెండు రోజుల ముందు నుంచి వర్షం కురుస్తుండడం, వాతావరణశాఖ అటవీ ప్రాంతాలు, ఊరు బయటి ప్రాంతాలకు వెళ్లరాదని హెచ్చరికలు చేస్తుండడం, ఆయా ప్రాంతాల్లో బురద ఉంటుంది గనుక దాదాపు అందరూ చివరి ఆదివారానికి వాయిదా వేసుకున్నారు. ఈ ఆదివారం మినహాయిస్తే సోమవారం పనిదినం ముందురోజే వన భోజనానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇలా కేవలం కడప నగరంలోనే ఐదు కుల సంఘాలు ఆదివారమే వనభోజనాలు నిర్వహిస్తుండడం విశేషం.

నేడు తొగట వీర క్షత్రియులు..

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన తొగట వీర క్షత్రియులు సంప్రదాయంగా ఈ సంవత్సరం కూడా కార్తీక వనభోజనం నిర్వహించనున్నట్లు ఆ సంఘం నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్యాసుధాకర్, పల్లా నరసింహారావు తెలిపారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌తోపాటు రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కడప నగర సమీపంలోని చెన్నైరోడ్డులో కనుమలోపల్లె వద్ద గల 108 శివలింగాల మహా లింగేశ్వరస్వామి సన్నిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సభ, వనభోజనం, నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ, మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతి ప్రదానం ఉంటాయన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సుదర్శన్, మురళీకృష్ణయ్య, చౌడం సూరిబాబు, వెంకటస్వామి, వెంకట రమణ, వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీయ, ఆర్యవైశ్యులు

కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం పద్మశాలీయులు, ఆర్యవైశ్య సామాజిక వర్గాలు వన భోజన కార్యక్రమాలు నిర్వహించనున్నాయి. పద్మశాలీయ సేవా సంఘం ఆధ్వర్యంలో కడప నగర పరిధిలోని రాజంపేట బైపాస్‌రోడ్డులోని పద్మశాలి కల్యాణ మండపంలో వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు అల్పాహారం, 9 గంటల నుంచి శ్రీ భద్రావతి భావ నారాయణస్వాముల వారి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం కార్తిక మాస వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలాగే కడప ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నగర శివార్లలోని వాటర్ గండిలోగల శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం 10 గంటలకు స్వామి వారికి అభిషేకంతో వన భోజన కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు విశేష ఏర్పాట్లు చేశారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలించవద్దు


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీజీబీ ప్రధాన కార్యాలయం మార్పు ఉపసంహరించుకోవాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు బహిరంగ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు మాసాల కూటమి పాలనలో రాయలసీమలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమ లేదా సంస్థ ఏర్పాటు చేయలేదన్నారు. పైగా ఇది వరకే మంజూరయిన కడప కొప్పర్తిలోని ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను మంగళగిరికి తీసుకుపోవడం, పులివెందుల మెడికల్ కళాశాలకు కేటాయించిన 50 సీట్ల భర్తీని రద్దు చేయించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, కేసీ బాదుల పాల్గొన్నారు.

సాగు భూమి, ఇళ్ల స్థలాల కోసం పోరు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేదలకు సాగు భూమి, ఇంటి స్థలాలు సాధించే వరకు పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో డీహెచ్‌పీఎస్, గిరిజన సమాఖ్య సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అర్హులైన వారికి రెండు ఎకరాల సాగు భూమి, ఇంటి స్థలాలు ఇచ్చి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఓట్లు పొంది అధికారంలోకి రాగానే విస్మరించడం పాలకులకు పరిపాటిగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 2న పులివెందుల, 16న బద్వేల్ ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, అధ్యక్షులు బ్రహ్మం, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు ఇమ్మానియేల్, నాగేశ్వరరావు, పడిగే వెంకటరమణ, పెంచలయ్య, ప్రసాద్ రావు, ప్రసాద్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

క్రొమటోగ్రఫీలో ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

వైవీయూ : క్రొమటోగ్రఫీలో నైపుణ్యం సాధించడం ద్వారా ఫోరెన్సిక్, ఔషధ రంగాల్లో చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. శనివారం కళాశాలలో స్టార్ డీబీటీ ప్రోగ్రాంలో భాగంగా రసాయన శాస్త్రశాఖ ఆధ్వర్యంలో క్రొమటోగ్రఫీ టెక్నిక్స్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనశాస్త్రంలో మిశ్రమాలను వేరు చేయడం, శుద్ధీకరణ తదితర అంశాలకు సంబంధించిన క్రొమటోగ్రఫీకి చక్కటి భవిష్యత్తు ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్, వర్క్‌షాప్ కన్వీనర్ మహేష్, కో కన్వీనర్ శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ షాహీన్, అధ్యాపకులు ఎం.కిశోర్‌కుమార్‌రెడ్డి, రాజేశ్వరి, నాగేశ్వర్‌రెడ్డి, అయ్యవారిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో కడప క్రీడాకారులు


ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : హర్యాణ రాష్ట్రంలో ఈనెల 23 నుంచి ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి హాకీ అండర్-17 పోటీల్లో కడప నగరానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు పాల్గొన్నారు. ఇటీవల నెల్లూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో కడప నగరంలోని డీఎస్‌ఏ స్టేడియంలో శిక్షణ పొందుతున్న ఎస్.ఇస్మాయిల్, మెర్లీ లుదియా క్రిస్టియానాలు చక్కటి ప్రతిభ కనబరచడంతో అండర్-17 ఏపీ బాలబాలకల జట్లకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి, కోచ్ కల్యాణ్ అభినందనలు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ వీరయ్య

కడప ఎడ్యుకేషన్ : సమగ్ర యాజమాన్య పద్ధతులతో విశిష్ట(టీసీజీఎస్-1694) రకం విత్తనంతో వేరుశనగలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. శనివారం కేవీకేలో బయోటెక్ కిసాన్ హబ్ పథకంలో భాగంగా సికెదిన్నె మండలం ఇప్పపెంట, వేంపల్లి మండలం గిడ్డంగివారిపల్లె, సిద్దవటం మండలం గుండమల గ్రామ రైతులకు సామూహిక ప్రథమశ్రేణి క్షేత్ర ప్రదర్శన కింద రబీ కాలానికి విత్తనం ఇవ్వడం జరిగింది. అనంతరం వేరుశనగలో అధిక ఉత్పాదకతను పెంచడంపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే కోఆర్డినేటర్ రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బయోటెక్ కిసాన్ హబ్ నిపుణులు గిరిష్ కుమార్, విస్తరణ శాస్త్రవేత్త మహేష్‌బాబు, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శిల్పకళ, సాయి మహేశ్వరి, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై ఎస్‌ఐ లాఠీతో దాడి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షేక్ బాషా

కడప అర్బన్ : కడప నగరంలోని అంబేడ్కర్ భవన్ సమీపంలో బజ్జీల దుకాణం రోడ్డుకు అడ్డంగా వుందని షేక్ బాషా (60) అనే వృద్ధుని మోకాలుపై ఎస్‌ఐ లాఠీతో కొట్టడంతో అతను నడవలేని స్థితిలోకి వెళ్లాడు. శనివారం సాయంత్రం ఎస్‌ఐ తన వాహనంలో అటుగా వెళుతుండగా బజ్జీల అంగడి రోడ్డుపై వుందనే నెపంతో లాఠీతో దాడి చేశారు. గాయపడిన వృద్ధుడిని బంధువులు రిమ్స్‌కు తరలించారు. రోడ్డుపైకి అడ్డంగా వుందని చెప్పడం పోయి దాడి చేయడం ఎంత వరకు సమంజసమని బంధువులు వాపోయారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా బజ్జీల దుకాణాన్ని రోడ్డుపైకి పెట్టాడని, కొట్టాలనే ఉద్దేశంతో కొట్టలేదని, అనుకోకుండా లాఠీ మోకాలి కింద భాగాన తగిలిందని తెలియజేశారు.

సత్యసాయిబాబా సేవలు ఎనలేనివి


సాయిబాబా చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మిరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : భగవాన్ శ్రీ సత్య సాయిబాబా సేవలు ఎనలేనివని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మిరెడ్డి అన్నారు. శ్రీ సత్య సాయిబాబా జయంతి ఉత్సవాలు సందర్భంగా శనివారం కడప నగరంలో ఉన్న శ్రీ సత్యసాయిబాబా మందిరంలో స్వామి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసత్య సాయి సేవా సమితి, సత్య సాయిబాబా ట్రస్ట్ తరపున ఎందరో పేద విద్యార్థులకు విద్యా బోధన చేయడం ఎంతో అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు వీరభద్రయ్య, అబ్దుల్ రాయల్ కరీముల్లా, ఓబుల్ రెడ్డి, ఇలియాస్, కన్వీనర్ పుట్ట రంగయ్య, సాయికుమార్, పుట్ట లక్ష్మి, స్వర్ణలత, నాగసుధా, శిల్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న వలంటీర్లు, సీఐటీయూ నాయకులు.

కడప ఎడ్యుకేషన్ : ఏపీ గ్రామ వార్డు వలంటీర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో వలంటీర్లు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు వలంటీర్లకు సంబంధించి రెండు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలన్నారు. జాబ్ కార్డు విడుదల చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ముఖ్యంగా బలవంతంగా రాజీనామా చేసినటువంటి వలంటీర్లను విధులకు తీసుకోవాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు.. అధికారంలోకి వచ్చిన వెంటనే అందర్నీ విధులకు తీసుకొని జీతం రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు విజయ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు .